# కత్తులవంతెన

**అడివి సూర్యకుమారి**

**జీతగాళ్ళు ధాన్యం బస్తాలను బండిమీద వేసుకొచ్చారు. పదిమంది నడుమ పంచాయతీలో ఉన్న శేఖరం బండి చూస్తూనే ఊత క్రరతోడుగా అరుగు మీది నుండి లేచాడు.**

''ఎల్లన్నా! తమ్ముడేడిరా?'' అడిగాడు.

'ఆరింకా పొలంకాడే ఉన్నారండి, ధాన్యం ఇంటికాడేసి రమ్మనారు'

అన్నాడు ఎల్లన్న మిగతా వాళ్ళ భుజాలకీ బస్తాలెత్తుతూ. శేఖరం క్రర సాయంతో లోపలికి నడుస్తూ ''ఏం పొలంపనులో! వేళకి భోజనానికి ర్రాడుగదా. ఇట్లా అయితే వీడి ఆరోగ్యం ఏంకాను? ఒరేయ్, మీరు వెంటనే పోయి నేనింకా భోంచెయ్యలేదని చెప్పండ్రా'' ధాన్యపుగది తాళం తీస్తూ అన్నాడు శేఖరం.

వాళ్ళు ధాన్యపు బస్తాలు లోపలవేస్తూ ''అట్లాగేనయ్యా'' అన్నారు.

అన్నీ లోపలికి చేరవేసి వరండా దిగువన నిలబడ్డారు.

'ఏంట్రా నిలబడ్డారూ పోకా' వాళ్ళ జాగును సహించలేక అన్నాడు శేఖరం.

''మరేం లేదండి, ధాన్యం కొలుస్తారేమోనని''

''ఇప్పటికే ఆలస్యమైంది. రేపు చూద్దాంలే తమ్ముణ్ణి రానీయండి''

''మిమ్మల్నడిగి కొలిపించుకోమన్నారండి. తమ దయింక''

''అయినా బాబూ, ప్రతి ఏడూ ఇదే పాటా! ఆ రెన్నడైనా గింజ కొలిచారా! అంతా తమ చేతులమీదుగా జరగాల్సిందేగాని. కొలవండి బాబూ! కొలవండి. తొరగా పోతాం మరి''

ఎల్లన్న చొరవగా గోతం పరుచుకుని కూర్చున్నాడు.

శేఖరం నవ్వి, రెండు బస్తాల ధాన్యం బైటికి తీయించి అందరికి కొలిచి పోశాడు. వాళ్ళవి భుజాలకెత్తుకుని పోయారు ఆనందంగా.

'మరిమేం సాయంకాలం కలుస్తాం శేఖరం బాబూ' అంటూ శెలవు తీసుకున్నారు. అరుగుమీది పెద్దమనుషులు మరో అరగంటకి శ్రీధరం పొలంనుండి వచ్చారు. వస్తూనే ''అదేంటన్నయ్యా నాకోసం ఎందుకాగావూ, కాస్తపని ఎక్కువుందంటేనిగా''

ఎదురొచ్చిన అన్న కూతురు శాంతికి బంతిపూల బుట్ట అందిస్తూ అన్నాడు.

''అప్పుడే రెండు దాటుతోంది. అన్నదమ్ములిద్దరూ నువ్వెందుకు కాగావంటె నువ్వెందుకనుకుంటూండండి. సాయంకాలం కూడా అవుతుంది'' విశాల వరండాలో కొచ్చి అంది.

'నీదే ఆలస్యం తల్లీ. ఇదిగో కాళ్ళు చేతులు కడుక్కొని వస్తున్నా' అంటూ పెరటివైపు వెళ్ళాడు శ్రీధరం. విశాల అన్నదమ్ములిద్దరికి వడ్డించింది.

భోజనం చేస్తూ ''ఇందాక ఆ విశాఖ వాళ్ళ దగ్గరనుండి ఉత్తరం వచ్చిందిరా, శాంతి వాళ్ళకి నచ్చిందట..'' అని ఆగాడు శేఖరం.

''ఇంకేమిటి! కట్నం గురించేనా''


అన్న ఆగింది దానిదగ్గరే అని ఊహించాడు శ్రీధరం.

''ఔను. వాళ్ళు నలభై వేలల్లో ఉన్నారు. ఖర్చులు కలుపుకుని అరవై వేలు. మనం తూగగలమా అని''

''అదేమిటన్నయ్యా! మంచి సంబంధం. డబ్బు గురించి పోనిస్తామా! శాంతి సుఖం కంటె మనకేం కావాలి?''

''అది కాదురా! శాంతి కొక్కదానికే అరవై వేలు ఖర్చు పెడితే ఎలా! నీకూ ఇద్దరాడపిల్లలున్నారు. హాస్టల్లో వుండి పెద్ద చదువులు చదువు





తున్న మగపిల్లల ఖర్చులు... ఇవన్నీ తలచుకుంటే..."

"అన్నీ అవే సక్రమంగా జరుగుతాయి. శాంతి మటుకు నా పిల్ల కాదా! దాని బాధ్యత నాకులేదా? నువ్వు డబ్బు గురించి చూడకు, వాన్నేమన్నారు"

"ఆయనకిష్టమే"

"మరింక ఆలస్యం దేనికి? ఏం వదినా?"

విశాల వైపు చూస్తూ అడిగాడు శ్రీధరం.

"అన్నీ సక్రమంగా కుదిరితే మాఘంలో చేయొచ్చు" అంది విశాల

"అన్నీ కుదురుతాయి. నేను పొలానికి పోతూ శాస్త్రిగార్నిటు పంపుతాను" లేచాడు శ్రీధరం.

ఓ పావుగంట పొలం విషయాలు అన్నగారితో మాట్లాడి కండువా భుజంమీద వేసుకుని కర్ర చేతపుచ్చుకుని పొలానికి బైలుదేరాడు శ్రీధరం.

"చీకటి పడకుండా వచ్చెయ్యి. పురుగూ పుట్రా ఉండేను" కేకేశాడు శేఖరం.

శ్రీధరం నవ్వుకుంటూ 'అలాగేలే' అన్నాడు బైటికెళుతూ. ముప్పై ఏళ్ళు దాటాయతనికి. అయినా అన్న దృష్టిలో తనింకా చిన్నవాడే.

దారిలోనే ఉన్న శాస్త్రిగారింటికెళ్ళాడు శ్రీధరం. అతణ్ణి చూస్తూనే శాస్త్రి "రావయ్యా! రా రా! ఏమిటి విశేషం. నువ్వే వచ్చావూ?" అన్నాడు కుర్చీ చూపుతూ.

"శాంతికి సంబంధం కుదిరింది శాస్త్రిగారూ! ఆ విషయమే చెప్పిరమ్మన్నాడన్నయ్య."

"శుభం. ఇదిగో ఇప్పుడే బైలుదేరుతున్నా. అన్నట్లు శ్రీధరం ఈ ఏడు ప్రతి ఏటికిలా కాక కస్త ఎక్కువివ్వాలయ్యా, అమ్మాయి వచ్చే నెలలో పురిటి కొస్తుంది కూడా"

పంట చేతికి రాగానే శాస్త్రిగారికి, గుడి పూజారిగారికి తొలుతగా కొంత ధాన్యం పంపే ఆనవాయితీ ఏనాటినుండో ఉంది. అదే మరికొంచెం ఎక్కువ కావాలంటున్నాడు శాస్త్రి.

"అలాగే. అన్నయ్యకి చెబుతాలెండి" అన్నాడు లేస్తూ శ్రీధరం.

సంక్రాంతి వచ్చేసింది.

ఈ ఏడు పంటలు బాగానే పండాయి. ధాన్యం గాదెలనిండా చేరింది.

శారద కూడా పండక్కి భర్తతో పుట్టింటికొచ్చింది. ఆమె ఆ ఇంటి ఒక్కగానొక్క ఆడపడుచు.

సెలవలకి పట్నంనుండి పిల్లలొచ్చారు.

పిల్లా జెల్లాతో ఇల్లంతా సందడిగా కళకళలాడుతోంది. ఆ మూడ్రోజులు ఇంటిముందుకొచ్చిన వారెవరినీ ఉట్టి చేతుల్తో పంపలేదు శేఖరం.

గంగిరెద్దుల వాడినుండి గుడి పూజారిగారి దాకా అందరినీ తృప్తి పరిచాడు.

"ఏమైనా శేఖరం చేతికి ఎముక లేదండీ"

అంటూ గుమ్మడికాయలు, వంకాయలు, దోసకాయలు మూటగట్టుకుని భుజాన వేసుకుని, ధాన్యం సంచులు చేతపుచ్చుకున్నాడు పూజారిగారు.

"ఉంచండి. జీతగాడితో పంపిస్తాను' అన్నాడు శేఖరం ఆయన అవస్థ గమనించి. ధాన్యపు సంచులు అందుకున్నాడు ఎల్లన్న. పూజారిగారు అనేకమైన ఆశీర్వాదాలిచ్చి కూరగాయల మూటతో వెళ్ళిపోయాడు.


అందరితోపాటు బావమరిదికి బట్టలు చెల్లెలిచే పంపించారు శేఖరం.

పది నిమిషాల్లో శారద ఖిన్న వదనంతో వచ్చింది.

"బాగాలేదా?" అడిగాడు శ్రీధరం.

'ఆయనకి బట్టలొద్దట. కలర్ టీవీ కావాలట' అంది మెల్లిగా.

"ఇక్కడ పెళ్ళికెదిగిన ఆడపిల్ల ఉంది.




వీళ్ళే మామలు కాబోతున్నారు. ఇంకా ఈయనకి బావమరిది లాంఛనాలు కావాలా! అడిగేవాళ్ళకి లేకపోతేసరి' ఈసడింపుగా అంది శ్రీధరం భార్య.

శ్రీధరం భార్యవైపు చూశాడు. 'ఇక్కడ అన్నయ్యున్నాడు నువ్వు మాట్లాడటమేమిటి?'' అని దానర్థం.

ఆమె గిరుక్కున లోపలికి వెళ్ళిపోయింది.

రెండు నిమిషాల మౌనం తర్వాత— 'అలాగేలేమ్మా పండగపూట అతనిలా కొత్త బట్టలు తిప్పిపంపటం నాకేం బాగలేదు. తీసుకోమని చెప్పు.'

తమ్ముడికేసి చూసి ''ఆ ఏర్పాటేదో చూడు'' అన్నాడు శేఖరం.

ఆ మరునాడు విశాల అన్నగారు కారులో వచ్చాడు. తిరుపతి కెళుతున్నారట. అట్లాగే చెల్లెల్ని, బావమరిదిని తీసుకెళ్ళాలని అతమద్దేశం.

పిల్లలు ఆరోజే హాస్టల్‌కి వెళ్ళిపోయారు. తండ్రి, తమ్ముడూ బలవంతం చేయటంతో శేఖరం, విశాలతో తిరుపతికి బైలుదేరక తప్పిందికాదు.

దక్షిణదేశ యాత్రలన్నీ పనిలో పనిగా ముగించారు. వెలాపదిహేను రోజులకి ఇల్లు చేరుకున్నారు శేఖరం, విశాల.

ఇంట్లో శ్రీధరం భార్య, పిల్లలు కన్పడలేదు. వంటింట్లో తమ దూరపుబంధువు వరమ్మగారు వంట చేస్తోంది.

ఎల్లన్న శేఖరానికి జరిగిన సంగతంతా వరండాలోనే చెప్పేశాడు.

''పెద్దయ్యకి మీరెళ్ళాక శానా జబ్బు చేసిందండి. లాయర్‌గోర్ని పిలిపించి వీలునామా రాయించారు. ఇక్కడున్న పొలాలు, ఇల్లు, పశువులు అన్నీ మీకంట. పట్నంలో ఇల్లొక్కటే శ్రీధరం బాబుకంట. ఇది తెలిసి చిన్నమ్మగోరు శానా గొడవ చేశారు. శ్రీధరం బాబేమీ మాట్లాడలేదు: మీరుత్తరం రాశారంటగా ఈ రోజొస్తున్నారని, నిన్ననే బాబు అమ్మగార్ని, పిల్లల్ని తీసుకుని పట్నం పోయాడు. ఉద్యోగం చూసుకుంటాట్ట''

వెంటనే తండ్రి పడుకున్న గదిలోకి ఊతక్ర సాయంతో వెళ్ళాడు శేఖరం.

''ఏమిటి నాన్నా! ఏమిటి? ఏం జరిగింది? ఎందుకిలాంటి పని చేశారు?''

పరమేశం కొడుకు చేతిని పట్టుకుంటూ ''నీకు న్యాయమే చేశాను బాబూ! నువ్వా అవిటి వాడివి. కాలులేదు. ఈ ఆస్తి అయినా లేకపోతే ఎలా బతుకుతావూ. నేనుండగానే సరిగ్గా పంచితే ఆ తర్వాత మీ మధ్య ఈ ఆస్తికై గొడవలు రావు. నీకు అన్యాయమూ జరగదు. శ్రీధరం చదువుకున్నాడు. తెలివైనవాడు. ఆరోగ్యవంతుడు. వాడెలాగైనా బ్రతగ్గలడు. అయినా వాడికేమీ తక్కువివ్వలేదు. పట్నంలో ఇల్లువాడిదే''

''అయినా వాడిప్పుడు ఇంట్లోంచి వెళ్ళిపోవాల్సిన అవసరమేంటి? అనారోగ్యంతో నువ్వేదో రాయిస్తే అది పట్టుకుని ఇంట్లోంచి వెళతాడా?''

''వాడు వెళ్ళిపోయాడన్న బాధ ఉన్నా నీకు న్యాయం చేశానన్న తృప్తి నాకు మనశ్శాంతినిస్తోంది''

శేఖరం మాట్లాడలేకపోయాడు.

తమ్ముడు, మరదలు, పిల్లలు లేనిలోటు కొట్టొచ్చినట్లు కన్పిస్తోందతనికి. ఒక్కడూ అన్నానికి కూర్చొని ప్రక్కన శ్రీధరం లేకపోవడంతో కంచంలో చెయ్యి కడుక్కున్నాడు. ఆ రాత్రి నిద్రపోలేదతను. మర్నాడు ఉదయాన్నే ఎల్లన్నను తోడు తీసుకుని బండిలో పట్నం వెళ్ళాడు. సాయంకాలానికే తిరిగొచ్చాడు.

''ఎలా ఉన్నార్రా చిన్నాడు? రమ్మనకపోయావా?'' అడిగాడు పరమేశం.

''బ్రతుకు తెరువు వెతుక్కుంటున్నానన్నయ్యా ఇప్పట్లో ఊరికి రాను అని చెప్పాడు'' అన్నాడు శేఖరం భారంగా.

చాలా దీర్ఘంగా గడిచింది శేఖరానికి ఆరోజు

తానవిటివాడా? నిస్సహాయుడా?

'అవిటివాణ్ణి నేను' అన్నసంగతి నాకింతకాలం గుర్తురాలేదేం? ఇన్ని సంవత్సరాలు ఈ అవిటితనం ఏమైంది? ఈ రోజెలా బైటపడింది?

తన అవిటితనాన్ని పదేపదే గుర్తు చేస్తున్న తండ్రి మాటలు అతని చెవుల్లో మార్మోగుతున్నాయి. ఇంట్లో ఉండి పెత్తనం చేసేదేకాని పొలం పనులు తనకేం తెలుసు?

బైట వ్యవహారాలు కూడా ఎక్కువగా శ్రీధరే చూసుకునే వాడు.

ఇప్పుడు తను ఒంటరిగా జీవితంతో పోరాటం సాగించాలంటే చెప్పరాని నిస్సత్తువ ఆవహించింది.

రోజులు వారాలుగా నెలలుగా గడిచాయి.

శేఖరం బండి కట్టించుకుని పొలానికి పోయి వారం రోజులు గడిచేసరికి జ్వరం వచ్చేసింది. ఆతర్వాత అతను మళ్ళీ పొలం మొఖం చూడలేదు. జీతగాళ్ళే అంతా చూడసాగారు. వాళ్ళది ఇష్టారాజ్యం అయ్యింది.

మూణ్ణెల్లపంట తెచ్చి పోశారు.

శేఖరం ఆశ్చర్యపోయాడు.

''ఇదేమిట్రా, ఇంత తక్కువ ధాన్యం వచ్చింది. ఎరువులు బాగానే వేశారు, పురుగుపట్టకుండా మందులేశారాయె. పంట బాగా పండిందని నలుగురూ చెపుతూంటే... ''

''ఎవరండీ... ఎవరండీ చెప్పింది. అంత మామీదనమ్మకం లేకపోతే మీరే వచ్చి చూసుకోండి రేపటాలనుండి. ఏదో తమరు కాల్లేనోరు ఇబ్బంది పడ్తున్నారుగందా అని మేం రెక్కలు ముక్కలు చేసుకుని ధాన్యం తెచ్చి మీ నట్టింట పోస్తే ఎదురు మాకే మాటలా?''

అన్నాడు ఎల్లన్న.

శేఖరం హతాశుడయ్యాడు. కుంగిపోయా

దు ధాన్యం తగ్గినందుక్కాదు.

తాను కుంటి వాణ్ణని, అసమర్థుణ్ణని, నిస్సహాయుణ్ణని పాలేరు జాలి చూపినందుకు. జాలి చూపుతోనే వాడు చేసిన మోసానికి ఏమీ చెయ్యలేని నిస్సహాయ స్థితిలోకి పడిపోయాడు.

సమయానికి డబ్బు సమకూరక శాంతికా సంబంధం తప్పిపోయింది. ఇంట్లో శ్మశాన నిశ్శబ్దం తాండవిస్తోంది.

వచ్చిన ధాన్యంలో సగం అమ్మి వచ్చిన డబ్బును పిల్లలకి పట్నం మనియార్డర్ చేశాడు.

వాళ్ళ చదువులెలా ఉన్నాయో! సరిగ్గా కాలేజీకి పోతున్నారో లేదో, వాళ్ళ ఆలనా పాలనా కనుక్కునే నాథుడే లేడు.

డబ్బు పంపమని వాళ్ళు వ్రాసినప్పుడల్లా వందలు వందలు పంపుతున్నాడు శేఖరం.

''ఇదేమిటి! ఇదివరకు వీళ్ళిలా చీటికి మాటికి డబ్బు పంపమని వ్రాసేవాళ్ళు కాదు. ఈ మధ్య వీళ్ళకింత ఖర్చు లెక్కువయ్యాయా?'' అడిగింది విశాల.

''ఏం చెయ్యను. ఇంతకు మించి నేనేం చేయగలను'' తన కాళ్ళవైపు చూసుకుంటూ గొంతు జీరబోగా అన్నాడు శేఖరం.

విశాల కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. అవి శేఖరం కంటపడ్డాయి.

ఇంతకాలానికి తన అవిటితనానికి దుఃఖిస్తోంది విశాల. ఆమెకి తనకంటే మంచివాడే భర్తగా లభించి ఉండేవాడు. విధి వక్రించి యాక్సిడెంట్‌లో కాళ్ళుపోయి ఇలా చెక్క కర్రలతో ఇన్నేళ్ళు నడిచినా కాళ్ళు లేవన్న సత్యం ఇంట్లో తామెవ్వరూ పట్టించుకోలేదు. ఈనాడు ప్రతి ఒక్కరికీ పాలేరునుండి యజమానురాలిదాకా అందరూ తన అవిటితనానికి బాధపడుతున్నారు. జాలి పడుతున్నారు. ఛీ... ఛీ... ఎదుటి వాళ్ళ జాలి భరించడం ఎంత కష్టం? శేఖరం, మనసులో రోజురోజుకీ కుళ్ళిపోతున్నాడు. ఎప్పుడూ తన వాకిట్లో పదిమందీ చేరి తన సలహా సహాయాలు అర్థించేవారు.

తను కుర్చీ దిగకుండా కూర్చుని పనులు జరిపించుకునేవాడు, ఇష్టం వచ్చినట్లు దానధర్మాలు చేశాడు.

ఇప్పుడా దాన ధర్మాలేవి! అలా సలహా అడిగేవాళ్ళేరి?

ఇలా అందరూ తనని వంటరివాణ్ణి చేశారెందుకని? శ్రీధరానికి తాను ద్రోహం చేసినట్లు చెవులు కొరుక్కుంటున్నారు. తను కన్పిస్తే మొహాలు తిప్పుకుపోతున్నారు, ఏమైంది వీళ్ళందరికి! జీతగాళ్ళు ధాన్యం పొలంనుండి అట్నించటే ఇళ్ళకి చేరేసుకుని మిగతాది తెచ్చిస్తున్నారు.

''ఇదేమిట్రా!'' అని గద్దిస్తే

''మీరిచ్చేది ముందుగానే తీసుకుంటున్నాం. ఇక్కడిదాకా తేవటం, మీకు కొలిచే శ్రమ తగ్గిస్తున్నాం''. గట్టిగా ఏదైనా అంటే ''మేం మానేస్తాం. ఇంకెవర్నయినా చూసుకోండి మరి'' అంటున్నారు.

తను చూసుకోలేడనేగా వాళ్ళ అహంకారం.

పిల్ల పెళ్ళాగిపోయింది.

ఎటువైపు చూసినా అంతా అస్తవ్యస్తం, అయోమయం, తన బతుకంతా అంధకారమయమైంది.

నిజంగా... నిజంగా తానిప్పుడు అవిటివాడు. ఆనాడు... నా తమ్ముడే నా కాళ్ళుగా నిలబడ్డాడు. ఈనాడు అలాంటి తమ్ముడేడి? ఏడి? వాడెలా దూరమయ్యాడు నాకు! ఎందుకు దూరమయ్యాడు? కారణం ఏమిటి?

కారణం!

ఆ... 'వీలునామా'

అది వీలునామా! కాదు! అది వీలునామా కాదు.

అది నాపాలిట కత్తుల వంతెన.

నా తమ్ముణ్ణి నాక్కాకుండా చేసింది.

ఇదంతా చేసింది... నాన్నే... ఆయనే దీనికి బాధ్యుడు.

శేఖరం తండ్రి గదిలోకెళ్ళాడు. అతనిలోని మార్పుని గమనించాడు పరమేశం.

కోపంగా తండ్రికేసి చూస్తూ ''నువ్వు... నువ్వే నాయి దురవస్థకి కారణం. నువ్వు నాకు మేలు చేయలేదు. ఘోరమైన అన్యాయం చేశావ్ నాకు. నా మీద జాలిపడమని కాదు నే కోరేది. నన్నొక మనిషిలా నువ్వు చూడలేదు. నేనవిటి వాణ్ణా! ఎవరన్నారు! నా తమ్ముడే నా కాళ్ళు! నా కాళ్ళను నాకు దూరంచేసి నన్ను నువ్వు ఈనాడు అవిటివాణ్ణి చేశావ్! నేను కుంటివాణ్ణికాదన్న స్థితి నాక్కావాలి! ఈ భాగ పంపకంతో నాకు ద్రోహం చేశావ్!''

ఏనాడు పల్లెత్తుమాట అనని శేఖరం తండ్రిపై విరుచుకుపడ్డాడు. ఆ తర్వాత ఓ వారం రోజులపాటు తను తండ్రికి తన మొహం చూపలేదు. మంచంలో ఉన్నా పరమేశానికి పరిస్థితులర్థమై తను ఎక్కడ తప్పుచేసింది తెలిసొచ్చింది.

కొడుకుల విషయంలో తను చాలా తొందరపడి పొరబడ్డాడు. కబురు పంపి చిన్న కొడుకును పిలిపించాడు. రెండవరోజుకల్లా వచ్చాడు శ్రీధరం.

''నేను నీ అన్నయ్య విషయంలో చాలా పొరబడ్డాన్రా'' అన్నాడు కళ్ళ నీళ్ళు పెట్టుకుంటూ.

తండ్రి కంట నీరు చూడలేకపోయాడు శ్రీధరం.

''ఏమిటి నాన్నా! ఇప్పుడేమైందని?'' ఓదార్చబోయాడు. తన బలహీనమైన చేతుల్తో కొడుకు చెయ్యి పట్టుకుని చించిన కాగితం ముక్కల్ని అతని చేతిలో పెట్టాడు. శ్రీధరం వాటిని చూసి ఆశ్చర్యపోయాడు.

అవి

'చిరిగిన వీలునామా కాగితం ముక్కలు.

